
# జాబితాలో అర్హులకు చోటేది?

- ఇందిరమ్మ ఇండ్ల సర్వే జాబితాలో అర్హులకు దక్కని చోటు
- 'ప్రజాపాలన'లో దరఖాస్తు చేసుకున్న పలువురి పేర్లు గల్లంతు
- అధికారుల నిర్లక్ష్యంపై ఆశావహుల అసహనం
- బాధితుల్లో కాంగ్రెస్ యువ నాయకుడి భార్య పేరు గల్లంతు



పిట్టల జయరాజు ప్రజాపాలనలో సమర్పించిన దరఖాస్తు రశీదు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 20 : ఇందిరమ్మ ఇళ్ల సర్వే జాబితాలో అర్హులైన పలువురికి చోటు లేకుండా పోయింది. ప్రభుత్వ ఆర్థిక సాయంతో సొంతింటి కలను నిజం చేసుకుందామనుకున్న నిరుపేదలకు నిరాశే ఎదురైంది. గతేడాది 2023 డిసెంబర్ 28నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాల లబ్ధిదారుల గుర్తింపు కోసం 'ప్రజాపాలన' పేరిట ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జనగామ జిల్లా వ్యాప్తంగా 1,77,382 ప్రజాపాలన దరఖాస్తులు అందాయి. జనగామ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 30వార్డుల నుంచి 14,668 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ల సహాయంతో దరఖాస్తుదారుల వివరాలను అధికారులు కంప్యూటర్‌లో నమోదు చేయించారు. ప్రస్తుతం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ యాప్ సర్వే' నిర్వహిస్తున్నది. దీని కోసం మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో నుంచి 9,814 మందిని గుర్తిస్తూ ప్రభుత్వం ఇటీవల జాబితా విడుదల చేసింది. సర్వే జాబితాలో అర్హుల పేర్లు లేకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులకు కూడా మినహాయింపు లేదు. పుట్టు కాంగ్రెస్ పార్టీ అని గర్వంగా చెప్పుకునే కొన్ని కుటుంబాలు కూడా బాధితులుగా ఉండడం గమనార్హం. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 30వార్డుల్లో ఐదు ఎస్సీ వార్డులు (1, 3, 13, 16, 30), రెండు ఎస్టీ (2,5) రిజర్వ్ వార్డులున్నాయి. 1వ వార్డు ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో 399మంది, 3వ వార్డు 190, 13వ వార్డు 427, 16వ వార్డు 525, 30వ వార్డులో 461మంది దరఖాస్తుదారుల జాబితా ప్రస్తుతం విడుదలైంది. అదేవిధంగా 2వ వార్డులో 262, 5వ వార్డులో 425దరఖాస్తుదారుల జాబితా విడుదలైంది. ఈ జాబితాలో పేర్లు గల్లంతైన అర్హులు కంటతడి పెడుతున్నారు. బాధితుల్లో 1వ వార్డుకు చెందిన పిట్టల నవనీత జయరాజు, గొల్లూరి రమ్య మధు, 2వ వార్డులో లకిశెట్టి సునీత విజయ్‌కుమార్, ఉప్పుల సంధ్యాకిరణ్ కుమార్‌తోపాటు పలు వార్డుల్లో బాధితులు ఉన్నారు. తమ పేర్లు గల్లంతు కావడంలో సంబంధిత మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నదని బాధితులు ఆరోపిస్తున్నారు. అర్హులైన తమకు న్యాయం జరిగే విధంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో లబ్ధిదారులుగా గుర్తించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

### మిస్సింగ్ జాబితా రూపొందిస్తున్నాం..



ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వే కోసం మాకు హైదరాబాద్ హెడ్ ఆఫీస్ నుంచి ఆన్‌లైన్ జాబితా వచ్చింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పలువురి పేర్లు జాబితాలో మిస్సింగ్ అయినట్లు మా దృష్టికి కూడా వచ్చింది. బాధితులను గుర్తించడానికి ఎన్యూమరేటర్లకు ప్రత్యేకంగా ఒక రిజిస్టర్ ఇచ్చాం. పూర్తి వివరాలు వచ్చాక ప్రత్యేక జాబితా రూపొందించి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తాం. బాధితులందరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేస్తాం.

*- వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, జనగామ*

### మాది పుట్టు కాంగ్రెస్.. కానీ జాబితాలో పేరు గల్లంతయ్యింది..



మా కుటుంబానిది పుట్టు కాంగ్రెస్ పార్టీ. 'ప్రజాపాలన'లో దగ్గరుండి నేనే దరఖాస్తు సమర్పించాను. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జాబితాలో నా భార్య నవనీత పేరు గల్లంతయ్యింది. పొద్దున లేస్తే రోడ్డుపై పండ్లు అమ్ముకొని జీవిస్తం. అప్పుసప్పు చేసి ఒక ప్లాట్ కొనుక్కున్నాం. మా పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నికల ప్రచారంలో వ్యాపారం బంజేసి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసినం. ప్రభుత్వ ఆర్థిక సాయంతో మా స్థలంలో సొంతిల్లు కట్టుకుందామనుకుంటే ఆ అవకాశం ఇప్పుడు లేకుండాపోయింది. మా పేరు గల్లంతు కావడంలో అధికారుల నిర్లక్ష్యం ఉంది. అధికారులు చేసిన తప్పిదానికి మా ప్రభుత్వానికి ప్రజల్లో చెడ్డ పేరు వచ్చేలా ఉంది. ఇప్పటికైనా నాలాంటి బాధితులందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలి.

*- పిట్టల జయరాజు, 1వ వార్డు కాంగ్రెస్ యువ నాయకుడు, జనగామ*

# ఊసేలేని పాలకమండలి

- ఐదేండ్లు గడిచినా ఐటీడీఏ సమావేశమేది?
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికార యంత్రాంగం
- కనుమరుగవుతున్న వివిధ శాఖలు
- ముందుకు సాగని అభివృద్ధి
- నీలినీడల్లో గిరిజన సంక్షేమం
- అపరిష్కృతంగా అడవి బిడ్డల సమస్యలు



ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయం

**ఐటీడీఏ పాలకమండలి సమావేశం నిర్వహణపై అధికార యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నది. వాస్తవానికి ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాల్సి ఉండగా ఐదేండ్లు దాటినా దాని ఊసే ఎత్తడం లేదు. సమస్యలు, సంక్షేమ పథకాలపై చర్చ జరిగితే నిధుల కేటాయించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కానీ 2019 డిసెంబర్ 20న నిర్వహించిన 60వ పాలక మండలి సమావేశమే చివరిదిగా మిగిలిపోయింది. దీంతో గిరిజన సంక్షేమంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అభివృద్ధి ముందుకు సాగడం లేదు. సబ్సిడీ పథకాలు లబ్ధిదారులకు అందకుండా వెక్కిరిస్తున్నాయి. ఇప్పటికైనా ఐటీడీఏ పాలకమండలి సమావేశం నిర్వహించి తమ సమస్యలు పరిష్కరించాలని అడవి బిడ్డలు కోరుతున్నారు.**

**– ఏటూరునాగారం, డిసెంబర్ 20**

గిరిజనుల అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ఐటీడీఏ పాలకమండలి సమావేశాలకు నోచుకోవడం లేదు. కలెక్టర్లు, పీవోలు మారుతున్నా అడుగు ముందుకు పడడం లేదు. 2019 డిసెంబర్ 20న జరిగిన సమావేశమే చివరిదిగా మిగిలిపోయింది. దీంతో అనేక రకాల పథకాలు కనుమరుగవుతున్నాయి. సబ్సిడీ పథకాలు లబ్ధిదారులకు అందకుండా పోతున్నాయి. కేవలం విద్య, ఇంజినీరింగ్ విభాగాల్లోనే అధికారుల హడావిడి కన్పిస్తున్నది. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం ద్వారా చేపడుతున్న పనులకు నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారులు ఐటీడీఏ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఐటీడీఏలో పాలకమండలి సమావేశం నిర్వహిస్తే ప్రభుత్వం కరుణించే అవకాశం ఉంది. ఐటీడీఏలో ఆర్థిక సహాయ పథకాలు అటకెక్కాయి. స్కిల్ డెవలప్‌మెంట్‌తో పాటు వివిధ రంగాల్లో యువతకు శిక్షణకు ఇవ్వడం మరిచారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ లాంటి శాఖలు పూర్తిగా కనుమరుగయ్యాయి. గిరిజన రైతులు ఐటీడీఏ ద్వారా ఎలాంటి లబ్ధి పొందడం లేదు. పంటల సాగుపై కనీసం సలహాలు, సూచనలు ఇచ్చే పరిస్థితి లేదు. సాగులో నైపుణ్యత కోసం నిర్వహించే క్షేత్ర ప్రదర్శన టూర్లు లేకుండా పోయాయి. వాణిజ్య పంటలపై శిక్షణకూడా ఏర్పాటు చేయడం లేదు.

### ఆశ్రమ పాఠశాలల్లో పేరుకుపోయిన సమస్యలు

ఆశ్రమ పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంటు చెడిపోయి ఏడాది దాటుతున్నా అలాగే వదిలేశారు. దీంతో విద్యార్థులు బోరు నీటినే తాగుతున్నారు. మండలంలోని చిన్నబోయినపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో టాయిలెట్స్ లేకపోవడంతో పిల్లలు రోడ్డెక్కుతున్నారు. పలు చోట్ల ఫ్యాన్లు తిరగడం లేదు. అధికారులు వీటన్నింటిని వదిలి కూలిపోయే దశలో ఉన్న నివాస క్వార్టర్లకు రూ. లక్షలు వెచ్చిస్తున్నారు. పలు పాఠశాలలు ఉపాధ్యాయులు లేక మూతపడ్డాయి. పూర్తి స్థాయి లో పర్యవేక్షణ కొరవడింది. ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లు కొనసాగుతున్నాయి. పీఎంఆర్‌సీ వ్యవస్థ దెబ్బతిన్నది. ఐటీడీఏలో ఐఏఎస్ అధికారి ఉన్నప్పటికీ గిరివికాస్ పథకానికి నిధులను డీఆర్‌డీఏ లకు కేటాయిస్తున్నారు. దీంతో నిధుల మంజూరు కోసం ఓ ఐఏఎస్ అధికారి నాన్ ఐఏఎస్ అధికారికి (జిల్లా స్థాయి) సిఫారసు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అసలు ఐదేళ్లుగా వివిధ శాఖలకు వచ్చిన నిధులెంత? ఖర్చు చేసిందెంత? అనేది తెలియకుండా ఉంది. నిరుపేద గిరిజన లబ్ధిదారులకు గుండెకాయ లాంటి ఎకనామికల్ సపోర్టు స్కీం కింద ఎంపికైన వారికి బ్యాంకర్లు గ్రౌండింగ్ చేయకపోవడంతో గోస పడుతున్నారు. సంక్షేమ పథకాల కోసం ఐటీడీఏ చుట్టూ తిరిగి వేసారి పోతున్నారు. గిరిజనులు పోడు భూముల హక్కు పత్రాల కోసం వెంపర్లాడుతున్నారు. ముల్లకట్ట రాంపూర్‌లో ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు కూడా అందడం లేదు. పంట భూములకు సాగు నీరందించాలని కోరుతూ వెయ్యి వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఐటీడీఏ కార్యాలయం, క్వార్టర్లకు రంగులు వేసి చేతులు దులుపుకుంటున్నారు. గిరిజన సంక్షేమంపై పట్టింపులేకుండా పోయింది. ఐటీడీఏ పాలకమండలి సమావేశాలు నిర్వహించేందుకు ఫైల్ తయారు చేయడం, కలెక్టర్, మంత్రుల ఆమోదం కోసం తిరగడానికే సరిపోతుంది. అసెంబ్లీ సమావేశాల అనంతరం, మినీ మేడారం జాతరకు ముందైనా ఐటీడీఏ పాలకమండలి సమావేశం నిర్వహిస్తారా? లేదా? అనే విషయం తెలియకుండా ఉందని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

# అంకుషాపూర్ అడవిలో మహిళ హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- పోలీసుల అదుపులో నిందితుడు ?



కాల్వ శైలజ (ఫైల్)

కాటారం, డిసెంబర్ 20 : మండలంలోని అంకుషాపూర్ గ్రామ శివారు అడవిలో కమలాపూర్ గ్రామానికి చెందిన కాల్వ శైలజ (30) హత్య కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన కాల్వ శైలజకు వివాహం కాగా ఐదేళ్ల తర్వాత మనస్పర్ధలు రావడంతో భర్తతో విడిపోయింది. కొన్నేళ్లుగా కమలాపూర్‌లోనే తల్లి దుర్గమ్మతో కలిసి కూలీ పని చేసుకొని జీవిస్తున్నది. కాటారం మండలం అంకుషాపూర్‌లో అక్క, చెల్లెలు ఉన్నందున అప్పుడప్పుడు శైలజ వారి వద్దకు వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఇనుగాల రమేశ్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. కొన్ని రోజులకు రమేశ్ భార్యకు విషయం తెలియడంతో గొడవలు జరిగాయి. దీంతో పెద్ద మనుషులు పంచాయితీ చేసి శైలజకు దూరంగా ఉండడంతోపాటు డబ్బులు ఇవ్వాలని తీర్మానించారు. అయితే గడువు ప్రకారం ఇంకా రూ.40 వేలు ఇవ్వకపోవడంతో రెండు నెలల క్రితం శైలజ రమేశ్‌ను డబ్బులు అడిగింది. దీంతో అతను డబ్బులు ఇవ్వకపోగా శైలజను కొట్టి చంపుతానని బెదిరించడంతో భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ క్రమంలో ఈ నెల 17న రమేశ్ శైలజ ఇంటికి వచ్చి రూ.40వేలు ఎలాగైనా ఇస్తానని కేసు వాపస్ తీసుకోవాలని లేకుంటే నన్ను జైలుకు పంపుతారని బతిమిలాడడంతో రాజీకి ఒప్పుకున్నది. అదే రోజు భూపాలపల్లిలో సెల్ఫ్ బండలు తీసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లిన శైలజ రాత్రి వరకు రాకపోవడంతో పాటు ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ అయింది. దీంతో ఆందోళన చెందిన తల్లి దుర్గమ్మ శైలజ ఆచూకీ కోసం అంకుషాపూర్‌లోని బిడ్డలు, బంధువులను సంప్రదించింది. అనంతరం భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆమె కోసం వెతుకుతుండగా అంకుషాపూర్ శివారులోని ఎర్రగుంట అటవీప్రాంతంలో శుక్రవారం బంధువులకు మృతదేహం కనిపించింది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ పరిశీలించి వివరాలు సేకరించారు. మృతురాలి ముక్కులో నురుగ ఉండడంతోపాటు తలపై గాయం ఉంది. శైలజను నమ్మించి రెండు రోజుల క్రితం అంకుషాపూర్ అటవీ ప్రాంతానికి తీసుకొని వచ్చి రమేశ్ హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, అనుమానితుడు రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

# పెస్టిసైడ్ లైసెన్స్‌తో బయో విక్రయాలు

### సీజ్ చేసిన వ్యవసాయ అధికారులు

మహదేవపూర్, డిసెంబర్ 20 : మండలంలోని ఓ దుకాణంలో పెస్టిసైడ్ లైసెన్స్ పొంది పూర్తి బయో విక్రయాలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ అధికారుల ఆకస్మిక తనిఖీలతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఏడీఏ శ్రీపాల్, ఏవో సుప్రజ్యోతి, ఏఈవోల ధర్మేందర్, రచనతో కలిసి శుక్రవారం ఆగ్రోస్సైకి పెస్టిసైడ్ దుకాణంలో తనిఖీలు చేపట్టారు. స్టాక్ సంబంధించిన పురుగుల మందులకు ఎలాంటి పత్రాలు లేవని, ప్రస్తుతం ఉన్న మందులు ఎక్కడి నుంచి వచ్చాయో సమాచారం లేదని, ఇన్‌వాయిస్, రైతులకు బిల్ బుక్‌లు, స్టాక్ బోర్డ్ లేదని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. అంతేకాక ప్రస్తుతం ఉన్న పురుగుల మందులు ఇక్కడే మానిప్యూలేట్ చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించి దుకాణాన్ని సీజ్ చేసి రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఏడీఏ వెల్లడించారు. స్టాక్ విలువ సుమారు రూ.13లక్షల వరకు ఉంటుందన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



మంచిర్యాల జిల్లా మందమర్రిలో పోలీసులు అదుపులో ఉన్న ఆటో డ్రైవర్లు



### కేటీఆర్‌ను కలిసిన ఆటోవాలాలు

*అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 20 : హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆటోవాలాలు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి తమ పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడుతున్నందుకు ఆటో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే 100 మందికిపైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇకపై ఎవరూ అలాంటి పనులు చేయొద్దని భరోసానిచ్చారు. మీ సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ హామీ ఇచ్చారు.*

# ఆటోడ్రైవర్ల అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

- రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్ల ముందస్తు అరెస్టులు
- హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో అడ్డగింతలు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆటోడ్రైవర్ల హెచ్చరికలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఉపాధి కోల్పోయామని, హామీ మేరకు ఆర్థిక సాయం చేయాలనే డిమాండ్‌తో ఆటోడ్రైవర్ల అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఆటోడ్రైవర్లు హైదరాబాద్‌కు తరలివచ్చారు. హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయం నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీగా బయల్దేరేందుకు సిద్ధమైన ఆటోడ్రైవర్లను కాస్త ముందుకు వచ్చిన తర్వాత పెట్రోల్‌బంక్ కూడలిలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఆటోడ్రైవర్లను నిర్బంధించి నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఆటో జేఏసీ నాయకులను ముందుస్తుగానే అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్ల జేఏసీ నాయకులు మారయ్య, వెంకటేశ్, సత్తిరెడ్డి మాట్లాడుతూ.. ఉచిత బస్సు స్కీమ్ తీసుకొచ్చి ఆటోడ్రైవర్లకు ఉపాధి లేకుండా చేశారని, ఆటోడ్రైవర్లను ఆదుకుంటామన్న ప్రభుత్వం దారుణంగా మోసగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. చర్చలకు పిలుస్తామని మాటిచ్చిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ తమ ఉద్యమం ఆగదని.. ప్రభుత్వం హామీలన్ని నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు.

### ఆటోడ్రైవర్లకు ఇంత విషం ఇవ్వండి

**ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్**

కోల్‌సిటీ, డిసెంబర్ 20 : కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినందుకు తమ చేతులతో తమ చెంపలను కొట్టుకుంటున్నామని ఆటోడ్రైవర్ల యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన గోదావరిఖనిలో విలేకరులతో మాట్లాడారు. ఆటో డ్రైవర్ల ఉసురు పోసుకోవడం కంటే ఈ ప్రభుత్వ పెద్దలే తమకు ఇంత విషం ఇవ్వాలని చెప్పారు. వెంటనే ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12 వేలు ఇవ్వాలని కోరారు.

### ఆటో కార్మికుల అరెస్ట్

నమస్తే నెట్‌వర్క్ డిసెంబర్ 20: సమస్యల పరిష్కారం కోసం చలో అస్లెంబీకి బయలుదేరి ఆటో యజమానులు, డ్రైవర్లను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా హైదరాబాద్‌కు వెళ్తున్న ఆటో కార్మికులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబయ్
ఫోన్: 022-22820427
అప్లై చేయడానికి QRని స్కాన్ చేయండి

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)లో క్లరికల్ కేడర్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ సేల్స్) రిక్రూట్‌మెంట్**

భారతీయ స్టేట్ బ్యాంకు రెగ్యులర్ బేసిస్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ సేల్స్) నియామకం కోసం అర్హులైన భారతీయ పౌరులనుండి దరఖాస్తులు కోరుచున్నది.

ఖాళీల సంఖ్య :
సాధారణ : 13735 + బ్యాక్ లాగ్ : 456

అర్హత ప్రమాణాలు (వయస్సు, అర్హత మొదలైనవి) అవసరమైన ఫీజులు మరియు ఇతర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు మరియు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు లింక్‌తో పాటు, బ్యాంక్ వెబ్‌సైట్ **https://bank.sbi/web/careers/current-openings** ప్రకటన నం. **CRPD/CR/2024-25/24** లో లభిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు మరియు ఫీజు చెల్లించే ముందు పూర్తి ప్రకటనని చూసి, తమ అర్హతలను నిర్ధారించుకోమని సలహా.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : **17.12.2024** నుండి **07.01.2025** వరకు.

ఏవైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు – **"CONTACT US" —> "Post Your Query"** లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ **https://bank.sbi/web/careers/current-openings**లో లభించును.

స్థలం: ముంబై
తేదీ: 17.12.2024
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)

